## ఓటరు స్లిప్పుల పంపిణీ



కోటగిరిలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్వోలు

కోటగిరి, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగా ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో బీఎల్వోలు ఆదివారం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు.

## నూతన జాతీయ విద్యావిధానంలో లోపాలను సవరించాలి

సిరికొండ, ఏప్రిల్ 28 : దేశంలో మూడేండ్లుగా అమలవుతున్న నూతన జాతీయ విద్యావిధానంలో లోపాలను సవరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ అన్నారు. మండలకేంద్రంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన విద్యావిధానం-2020లో అనేక లోపాలున్నాయని, ఫలితంగా విద్య కార్పొరేటీకరణ జరగడమే గాక పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని అన్నారు. బడుగు, బలహీనవర్గాలకు కొనసాగుతున్న రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగాలన్నారు. ఖాళీగా ఉన్న పర్యవేక్షణ అధికారుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రతి మండలానికీ విద్యాశాఖ అధికారిని నియమించాలని, 317 జీవో బాధితులకు సొంత జిల్లాలకు పంపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఓటు హక్కుపై ఫొటో ప్రదర్శన

కంఠేశ్వర్, ఏప్రిల్ 28 : కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై ఫొటో ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి మే 1వ తేదీ వరకు జిల్లాకేంద్రంలోని టీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభిస్తారని తెలిపారు. తొలిసారి ఓటు వేయనున్న యువతకు ఎన్నికల మొబైల్ యాప్‌ల వినియోగం, అవినీతికి తావులేని ఓటు హక్కు వినియోగం, ఎన్నికల చరిత్రపై ఫొటో ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వారు, ఓటర్లు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## ఇంట్లో అందరూ ఉండగా చోరీ

- **అర్ధరాత్రి 2 తులాల బంగారు గొలుసు, సెల్‌ఫోన్ల అపహరణ**

ధర్పల్లి, ఏప్రిల్ 28 : ఇంట్లో అర్ధరాత్రి అందరూ నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎన్టీఆర్ కాలనీలో శనివారం అర్ధరాత్రి కుటుంబసభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగానే దుండగులు చొరబడి దొరికిన కాడికి దోచుకెళ్లారు. సెల్‌ఫోన్లు, 2 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## మంచి కవిత్వంతోనే సమాజంలో మార్పు




నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న హరిదా రచయితల సంఘం ప్రతినిధులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28 : జిల్లాకేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో మంచి కవిత్వంలో భాగంగా సురారం శంకర్ గారి సాహిత్యంతో ఒకరోజు అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వకార్యదర్శి డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి హాజరై మాట్లాడారు. కమ్మని కవిత్వానికి చిరునామా సూరరం శంకర్ అన్నారు. సూరారం శంకర్ ఏ ప్రక్రియలో రాసినా అందులో కమ్మని కవిత్వం పాఠకులను ఆకర్షిస్తుందని అన్నారు. కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, ప్రముఖ గజల్ రచయిత వి.నర్సింహారెడ్డి, మఠం సుజాత, కమినేని రేణుక, పద్మజారెడ్డి, నరాల సుధాకర్, జి. నర్సింహస్వామి, కాసర్ల నరేశ్, సాయిబాబు, తిరుమల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మారుస్తే అంబేద్కర్‌కు అవమానమే..

నందిపేట్, ఏప్రిల్ 28 : కేంద్రంలో బీజేపీకి 400 ఎంపీ సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామనడం అంబేద్కర్‌ను అవమానించడమేనని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ జాతి కోసం 30 ఏండ్ల క్రితం ఎమార్పీఎస్‌ను స్థాపించిన మందకృష్ణ మాదిగ పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని, గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మాదిగలు ఓట్లు వేయాలని మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆయన బీజేపీకి మాదిగల తరపున మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు పరిస్థితి దయనీయంగా ఉందని అన్నారు.

# ప్రైవేట్ దవాఖానలో గర్భిణి మృతి



దవాఖానలో మృతురాలి బంధువుల ఆందోళన

**మృతదేహంతో దవాఖాన ఎదుట ఆందోళన**



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

వినాయక్‌నగర్/ ఖలీల్‌వాడి, ఏప్రిల్ 28 : గర్భంలోని బిడ్డ ఆరోగ్యం బాగా లేదని.. వైద్యులు అబార్షన్ కోసం మందులు ఇవ్వడంతో అవి వాడిన నాలుగు నెలల గర్భిణి తీవ్ర రక్తస్రావంతో మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందిందని గర్భిణి కుటుంబీకులు, బంధువులు సదరు దవాఖాన ఎదుట నిరసన తెలిపారు. బాధితుల కథనం ప్రకారం..

నిజామాబాద్ రూరల్ మండలం కాలూర్ గ్రామానికి చెందిన నాలుగు నెలల గర్భిణి కంఠం స్రవంతి (35) వీక్లీ మార్కెట్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో వైద్యురాలికి చూపించుకున్నది. శనివారం ఉదయం సదరు దవాఖానలో హెల్త్ చెకప్ కోసం వచ్చింది. గర్భంలో ఉన్న బిడ్డ ఆరోగ్య పరిస్థితి బాగా లేదని, హార్ట్ బీట్, శ్వాస సంబంధిత సమస్య ఉందని వైద్యులు గర్భిణికి సూచించారు. అబార్షన్‌కు సంబంధించిన మందులు ఇవ్వడంతో గర్భిణి, కుటుంబీకులు అవి తీసుకొని ఇంటికెళ్లారు. మందులు వేసుకున్న అనంతరం గర్భిణికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె కుటుంబీకులు ఆందోళనకు గురై దవాఖానకు ఫోన్ చేసి మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉదయాన్నే గర్భిణిని దవాఖానకు తీసుకురావాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం గర్భిణిని సదరు దవాఖానకు తీసుకెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉన్నది, మరో దవాఖానకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో చేసేదేమీ లేక గర్భిణి బంధువులు మరో దవాఖానకు తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని ధ్రువీకరించారు. దీంతో ఆగ్రహానికి గురైన గర్భిణి కుటుంబీకులు, బంధువులు సదరు ప్రైవేట్ దవాఖాన ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే స్రవంతి మృతిచెందిందని ఆరోపించారు. న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి వెళ్లేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. మధ్యవర్తుల ద్వారా బాధిత కుటుంబానికి దవాఖాన యాజమాన్యం నష్టపరిహారం చెల్లించడంతో వారు ఆందోళన విరమించారు.

# కాంగ్రెస్‌కు ఓట్లడిగే అర్హత లేదు



వర్ని మండల కేంద్రంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, పక్కన బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, కార్యక్రమానికి హాజరైన ప్రజలు

- **హామీలు నెరవేర్చని వారికి ఓటెందుకు వేయాలో ఆలోచించాలి**
- **బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి**
- **జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం**

వర్ని, ఏప్రిల్ 27 : ఆరు గ్యారెంటీలను కేవలం వంద రోజుల్లో అమలుచేస్తామని హామీ ఇచ్చి.. అమలుచేయని కాంగ్రెస్ పార్టీకి ప్రజలను ఓట్లడిగే అర్హత లేదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. వర్ని మండల కేంద్రంలో జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం రాత్రి రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. రైతులకు కనీసం సాగు నీరందించలేకపోతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, రైతుబంధు ఇవ్వకుండా రైతులను అప్పులపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రజలతో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, వర్ని జడ్పీటీసీ సభ్యుడు బర్దావల్ హరిదాస్, మండల కో-ఆప్షన్ సభ్యుడు కరీం, బీఆర్‌ఎస్ నాయకులు కల్లాలి గిరి, వెలగపూడి గోపాల్, సింగంపల్లి గంగారాం, రంజ్యానాయక్, పండరి, రాజు, నరెడ్ల శ్రీను, దిలారి బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- **మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్**
- **కంజరలో బూత్ కమిటీ సభ్యులతో సమావేశం**



కంజరలో నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్

మోపాల్ (ఖలీల్‌వాడి)/ ఇందల్వాయి, ఏప్రిల్ 28 : బీఆర్‌ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ అన్నారు. మోపాల్ మండలంలోని కంజరలో బూత్ కమిటీలు, నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజలకు అండగా ఉండే వ్యక్తి అని, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూరల్ నియోజకవర్గంలో ఆయన ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ప్రచార కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కంజర భూమయ్య, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలంలోని వెంగళ్‌పాడ్ తండా, తిర్మన్‌పల్లి, గంగారాం తండాలో బూత్ కమిటీలు, నాయకులతో ఇందల్వాయి ఎంపీపీ రమేశ్ నాయక్ ఆదివారం సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో చేపట్టిన అభివృద్ధి, అమలుచేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపునకు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, బీఆర్‌ఎస్ మండలఅధ్యక్షుడు ఇలువేరి దాసు, ఎంపీటీసీ దాసు, శెట్టి బీరీష్, గడ్కోల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ప్రచారం



తిర్మన్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

సారంగాపూర్, ఏప్రిల్ 28 : బీఆర్‌ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లిలో నాయకురాలు, మాజీ వార్డుమెంబర్ ముంతాజ్‌బేగం మహిళలతో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకే ఓటు వేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

బాల్కొండ, ఏప్రిల్ 28: మండల కేంద్రానికి చెందిన పార్దే పోశెట్టి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా మంజూరైన రూ.9,04,845 విలువైన ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం మృతుడి భార్యలక్ష్మికి బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ గుజరాతి మోహన్, అడ్వయిజర్ అంజయ్య, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

రెంజల్, ఏప్రిల్ 28: మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్సై సాయన్న ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. వచ్చి పోయే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేసి, పత్రాలు పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచించారు. మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, వాహనాల్లో మద్యం, డబ్బులు తరలించే అవకాశం ఉందని, తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఎడపల్లి, ఏప్రిల్ 28: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపునకు కృషి చేయాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో ఆదివారం జడ్పీ చైర్మన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ బూత్ లెవల్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో బూత్ కమిటీలో 10 మంది చొప్పున సభ్యులు ఉంటారని, 100 మంది వోటర్లకు ఒక కమిటీని ఏర్పాటు పని చేస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే వరకు ఈ కమిటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. దీంతోపాటు పోస్ట్ కార్డు ఉద్యమాన్ని రైతులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీరాం, నాయకులు రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, గుంజరి రెడ్డి, శేఖర్ రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి కన్నా అబద్ధాల కోరు భారత రాజకీయాల్లోనే లేరు

- **ఇంతకాలం గుర్తుకురాని గల్ఫ్ బోర్డ్ ఎన్నికల సమయంలో గుర్తొచ్చిందా?**
- **ఎంపీ ధర్మపురి అర్వింద్ మండిపాటు**




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 28 : సీఎం రేవంత్‌రెడ్డి కన్నా అబద్ధాల కోరు భారత రాజకీయాల్లోనే లేరని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మళ్లీ రిజర్వేషన్ల రాజకీయం చేస్తున్నారని, మోదీ, అమిత్‌షా రిజర్వేషన్లపై చెప్పినా మళ్లీ కిషన్‌రెడ్డి ఎందుకు చెప్పడం లేదంటూ పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఇండియన్ పీపుల్స్ ఫోరం అధ్యక్షుడు జితేంద్ర వైద్యతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. తాము ఏడాది దోపిడీ చేయకుండా ఉంటే రూ.40 వేల కోట్లు జమచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, దీంతో వారు ఎంత దండుకుంటారో తెలుస్తున్నదని ఆరోపించారు. 45 ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్న జీవన్‌రెడ్డి ఎన్నడూ గల్ఫ్‌లో ఉంటున్న వారి విషయం మాట్లాడలేదని, ఇప్పుడు ఎన్నికల సమయంలో గల్ఫ్‌బోర్డ్ పెడతామంటూ చిల్లర రాజకీయం చేస్తున్నారని మండి పడ్డారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి కాల విరామ బైబిల్ తరగతులు



సర్టిఫికెట్లతో చిన్నారులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో ఉన్న సీఎస్ఐ వెస్లీ చర్చిలో నాలుగు రోజులుగా కొనసాగిన వేసవికాల విరామ బైబిల్ తరగతులు ఆదివారం ముగిశాయి. ప్రెస్బిటల్ ఇన్‌చార్జి, జీడీసీసీ సండే స్కూల్ సెక్రటరీ రెవరెండ్ దినకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. వేదాంత తరగతుల అధ్యయనంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చిన్నారులు ఆటపాటలతో బైబిల్ వాక్యాలను పాఠించి ఆకట్టుకున్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్వీట్లు, బహుమతులు అందించారు.

## త్రివేణి సంగమానికి బస్సు రద్దు

రెంజల్, ఏప్రిల్ 28: మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రానికి నడుస్తున్న కందకుర్తి -నిజామాబాద్ లోకల్ బస్ సర్వీస్‌ను నిజామాబాద్ - 2 డిపో ఆర్టీసీ అధికారులు ఇటీవల రద్దు చేశారు. ఈనెల 23 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం పాఠశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. దీంతో ఆర్టీసీ అధికారులు కందకుర్తి - నిజామాబాద్ బస్సు సర్వీస్‌ను రద్దు చేశారు. కందకుర్తి సమీపంలోని గోదావరితోపాటు హరిద్రా, మంజీరా, నదులు కలిసే త్రివేణి సంగమ క్షేత్రాన్ని దర్శించుకునేందుకు అమావాస్య, పౌర్ణమి, ఇతర పర్వదినాల్లో పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు భారీ సంఖ్యలో ఆర్టీసీ బస్సులో చేరుకుంటారు. ఇక్కడి నుంచి బాసర సరస్వతీ దర్శనానికి, అక్కడి భక్తులు త్రివేణి సంగమానికి చేరుకునేందుకు నవీపేట మీదుగా నిజామాబాద్ వరకు బస్సు నడిపితే ఎంతో సౌకర్యంగా ఉంటుందని భక్తులు అంటున్నారు. బస్సు రద్దు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మీ పథకం అందని ద్రాక్షగానే మిగిలిపోతుందని మహిళలు వాపోతున్నారు. మహిళలు అధిక చార్జీలు చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో తమ గమ్యస్థానానికి చేరుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులకు స్పందించి బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.


## మినీ ట్యాంక్‌బండ్‌ను పట్టించుకోని పాలకులు

- **ఎండిపోతున్న చెట్లు**
- **స్పందించని అధికారులు**

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్28: కేసీఆర్ సర్కారు హయాంలో చెరువులను అభివృద్ధి చేసి ట్యాంక్ బండ్‌లుగా తీర్చిద్దారు. పట్టణంలోని మల్లె చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసే పనులకు 2023లో అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కోట్ల రూపాయల వ్యయంతో మల్లె చెరువుకట్టను మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేపట్టారు. పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్ నిర్మాణం పనులు పూర్తి చేశారు. చెరువు కట్ట సుందరీకరణలో భాగంగా చెట్ల వేరే ప్రదేశాల నుంచి దిగుమతి చేసుకుని నాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాలకులు అటు వైపు కన్నెత్తిచూడడం లేదు. అడిగేవారు లేకపోవడంతో అధికారులు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. చెరువు కట్టపై నాటిన చెట్లు ఎండిపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఎండిపోయిన చెట్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఎండిపోతున్న చెట్లు



**కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. - మోర్తాడ్(కమ్మర్‌పల్లి), ఏప్రిల్ 28**

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

★SR ఆక్వా సొల్యూషన్స్, నిజామాబాద్ వాటర్ ప్యూరి ఫైయర్స్ నందు పనిచేయుటకు టెక్నిషియన్ (Male) కావలెను. Qual: ఇంటర్, జీతం + ఇన్సెంటివ్ సంప్ర॥ ✆ 98482 68883
NTZ-324910

**CHANGE OF NAME**

★I, DARAVASTHU ASHOK GANGADHAR (Old Name) I Have changed my name as DARAVASTHU ASHOK (New Name) S/o. Daravasthu Gangadhar Gaurayya, H.No. 2-56, Donkal, Morthad, Nizamabad 503 311
NTZ-324909

**WANTED**

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెల్: 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.